
# "సాహితీలోక రక్షక...."




సోమంచి రామం

దూరాన్నుంచి సన్నగావినిపిస్తున్న సినిమా రికార్డు క్రమ క్రమంగా దగ్గరైంది. ఆరికార్డు అయిపోయింది కాబోలు రిక్షాలో కుర్రాడు ఇంకో రికార్డు పెట్టాడు. వీధిలో ఆడుకుంటున్న చిన్న పిల్లలు ఆ రికార్డుకు తగ్గ డాన్సు మొదలెట్టారు. ఆ పాట వినలేక లోపల కొచ్చి పేపరు తీసి చదువుకుందామని కూర్చున్నాను. ఇంతలో ఆ పాట టక్కున ఆగిపోయింది. రిక్షాలో కుర్రాడు గొంతు సవరించుకుని మైకు దద్దరిల్లేట్లుగా ప్రకటన ప్రారంభించాడు. ఏదో సినిమా ప్రకటనే కాబోలునని అంత శ్రద్ధగా వినబుద్ధవలేదు. కాని—

"మహాశయులారా!" అన్న మాట వినపడింది. మామూలుగా వినబడే మీ అభిమాన థియేటరులో మీ అభిమాన నటుడు మీ అభిమాన నటి నటించిన మీ అభిమాన చిత్రం నేడే చూడండి లాంటివి కాకుండా ఇలా ప్రారంభమయేసరికి ఇదేదో సినిమా బాపతు కాదని ఒక చెవి అటు పారేశాను.

"ఈ రోజు సాయంత్రం అయిదు గంటలకు మన పట్టణ టౌనుహాల్లో గొప్ప సాహిత్య సభ జరుగుతుంది. ఆ మహాసభలో మన పట్టణ వాస్తవ్యులు శ్రీ శ్రీ పరంధామయ్యగార్కి సాహితీ లోక రక్షక్ బిరుదు ప్రధానం జరుగుతుంది. కావున మీ రద్దరూ దయచేసి సభను జయప్రదం చేయ ప్రార్థన ఇట్లు పట్టణ సాహితీ లోక రక్షక మండలి."

మళ్ళీ రికార్డు మోత. రిక్షా క్రమంగా దూరంగా సాగిపోయింది. అంతే! నాకు ఒక్క అక్షరంకూడా ముందుకు సాగలేదు. చేతిలో పేపరు అక్కడే జారిపోయింది. బుర్రలో ఆలోచన ప్రారంభమయింది. మా వూళ్ళో నాకు తెలియకుండా ఈ సాహిత్యసభ జరుగుతూందంటే నాకే ఆశ్చర్యంగా ఉంది. అంటే నాకు తెలియకుండ సాహిత్యసభ జరగకూడదని కాదు! కాని ఏ సాహితీ సభ జరిగినా నాకు తెలియకుండా నాకు తెలియ పర్చకుండా ఎవరూ ఉండరు. అలాంటిదిప్పుడు ఈ రోజు ఈ సభ జరుగుతూందంటే పైగా ఈ పరంధామయ్య గారెవరూ? మా పట్టణ వాస్తవ్యులేనని కూడా చెప్పాడు! ఎవరై ఉంటారు చెప్మా? ఆయన ఎవరై ఉంటారో తెలుసుకోవడం కోసం మా పట్టణాన్నంతా పరిశీలన చేయడం ప్రారంభించాను.

మా పట్టణంలో మేడ లున్నాయి. మిద్దె లున్నాయి. డాబా లున్నాయి. పెంకుటిళ్ళు న్నాయి. పూరి గుడిసె లున్నాయి. మేడల్లో రంగు రంగుల అలంకారాలు, ఫర్నిచరూ ఉంటుంది. మా వూళ్ళో పూరి గుడిసెల్లో బక్క చిక్కిన జీవాలు కిక్కిరిసి ఉంటాయి. మా వూళ్ళ తారు రోడ్లున్నాయి. అఫ్‌కోర్స్! ఆ రోడ్ల నిండా గోతు లుండీ, నీళ్ళుండీ, పాదచారులకు దేహాలంకరణ చేసేందుకు వీలుగా ఉంటాయనుకోండి! అదివేరే విషయం! మా వూళ్ళో పురాణకాలం నాటి పుష్పక విమానాన్ని మరిపించేలా పరుగులెత్తే సిటీ బస్సులూ ఉన్నాయి. అవి ఎక్కడ ఆగిపోతే అక్కడే అంతా కలిసి వాటిని తోసుకు పోగల వోర్పు, నేర్పుగల మనుష్యులూ ఉన్నారు. మా వూళ్ళో వీధి వీధికీ పంపులూ, ఎలక్ట్రిక్ దీపాలు ఉన్నాయి. పంపుల్లో నీళ్ళు రాకపోతేనూ, లైట్లు వెలగకపోతేనూ వాటి తప్పా? మా వూళ్ళోనూ పేవ్‌మెంట్లు అవే ఫుట్‌పాత్ లున్నాయి. బ్రహ్మపదార్థంలా అవి బతికున్న వారి కంటికి కనపడవు. పగలల్లా రకరకాల వస్తు విక్రయశాలలు, రాత్రిళ్ళు రకరకాల వ్యక్తుల విశ్రాంతి నిలయాలుగా ఉపకరించే ఆ పేవ్‌మెంట్ల కోసం వెతకడం వృధా ప్రయాస!

అయ్యో! ఇహ ఇంక విషయాని కొస్తాను. మా వూళ్ళోనూ కవు లున్నారు. భావకవులు అహంభావ కవులు, బాల కవులు, పాలకవులు, పాపాల కవులు సీసాల కవులు మందు సీసల కవులు ఇంకా. ఇంకో రచయిత లున్నారు. రచయిత్రు లున్నారు. కథకు లున్నారు. నటు లున్నారు. నటీమణు లున్నారు. గాయకు లున్నారు. గాయనీమణు లున్నారు నాయకు లున్నారు. వినాయకు లున్నారు. చోటా, బడా, ఉప, మాజీ, తాజా, యువ నాయకు లెందరో ఉన్నారు. వర్తకు లున్నారు. నర్తకు లున్నారు డాక్టర్లున్నారు. యాక్టర్లున్నారు. టీచర్లున్నారు. చీటర్లున్నారు. మా వూళ్ళోనూ రీడర్సు ఉన్నారు.

అంటే కొంపతీసి మా వూళ్ళో యూనివర్సిటీ ఉందనుకునేరు? అయినా ఏమో ఏం చెప్పగలం? ఏ నాటికైనా మా వూరికే ఒక యూనివర్సిటీ రాకపోతుందా! మా వూళ్ళో రీడర్స్ అంటే పాఠకు లన్న మాట! ఏ పత్రికా, ఏ మేగజైనూ స్వంతంగా కొనకుండా ఒకే పత్రికను సామూహికంగా ఏ ముక్కకా ముక్క చించకుండ చదవగల సమర్థు లన్నమాట. మా రీడర్స్‌ను చూసే ఈ మధ్య చాలా పత్రికలు కంపార్ట్‌మెంటల్ బైండింగ్ పద్ధతి ప్రవేశ పెట్టి అధిక లాభాలుఆర్జిస్తున్నాయని వినికిడి. మా వూళ్ళో కథా రచయితలు, కథానికా రచయితలు, మినీ కథా రచయితలు, పెద్ద కథా రచయితలు, గొలుసు కథా రచయితలు, హాస్యకథారచయితలు, అపహాస్య కథా రచయితలు, ఉత్తరాల రచయితలు, కార్టూన్ రచయితలు, కాకా రచయితలు, కాపీ రచయితలు వర్ధమాన రచయితలు, దినదిన ప్రవర్ధమాన రచయి తలు, వృద్ధ రచయితలు ఇలా. ఒకరేమిటి? రకంకాల సాహితీ సేవకు లున్నారు. ఇంకా చాలా చాలామందే ఉన్నారనుకోండి. వారందరి గురించి ఇప్పుడు చెప్పడం భావ్యం కాదు.

ఇంతమందిలో ఈ పట్టణంలో కాగడా పెట్టి గాలించినా, నా మనోనేత్రానికి పరంధామయ్యగా రెవరో అంతు పట్టక పోయే సరికి నా అజ్ఞానానికి నాకే సిగ్గనిపించింది. సాహిత్యసేవలో కొద్దో గొప్పో చెయ్యి తిరిగిన వాణ్ణి కాకపోయినా, చెయ్యి కాల్చుకున్న వాణ్ణి కాబట్టి, మా గురువర్యులు సెలవిచ్చి నట్లు కాస్తో కూస్తో కథాదురద కలవాణ్ణి కావటం చేత ఈ నాడు ఈ పరంధామయ్యగా రెవరో తెలుసుకోలేకపోవడం నాకు తల కొట్టేసినట్లయింది. అసలాయన పేరే సాహితీ రంగంలో ఎక్కడా వినలేదే! ఒక్క కథ కాని, ఒక్క గేయం కాని కనీసం ఏ పత్రికలోనైనా ఒక్క ఉత్తరం గాని ఆ పేరుతో ఎప్పుడూ చదవలేదే! అలాంటిది ఆయనకు ఈ రోజు సాహితీసభలో బిరుద ప్రధానమా! నాకు ఇవ్వక పోయారన్న దుఃఖంతోపాటు ఇలాటి వూరూ పేరూ లేని వానికి బిరుదు తగిలించి సన్మానం చేస్తున్నా రంటే మరింత ఘోరావమానంగా తోచింది నాకు. ఏమైనా సరే సాయంత్రం ఆ సభకు వెళ్ళి అక్కడే ఆయన గొప్పతనమేదో తెలుసుకోవాలనుకున్నాను. సాయంత్రం ఎప్పుడవుతుందాని ఎదురు చూస్తూ బద్ధకంగా నడుం వాల్చాను.

తీరా మెలకువ వచ్చి లేచి చూసేసరికి సమయం సాయంత్రం ఆరు గంట లయిపోయింది. అయ్యయ్యో ఎంత ఘోరం జరిగి పోయింది! ఎంత నిద్ర మత్తులో పడిపోతిని? నా భారతదేశమా! నా వంటి సోమరిపోతు లను నీవు మన్నించగలవా తల్లీ! అనుకుంటూ గబగబ ముఖప్రక్షాళన గావించి, దుస్తులను వైచికొని పరుగు పరుగు లాటి నడకతో ఆ రిక్షా వాడు ప్రక టించిన పట్టణ టౌను హాలు కడ కేగితిని. అయ్యో! ఏ మని చెప్పుదు అచ్చటి కోలాహలము! టౌనుహాలు యావత్తూ జనంలో కిక్కిరిసి యున్నది. ఆ జన సందోహంలో నన్నెరిగియున్న, లేక నే నెరుగున్న వ్యక్తు లెవ్వరూ కానరాకుండిరి. సమయపాలన తెలిసియున్న సాహితీలోక రక్షకమండలి వారు సభను సరియైన సమయమునకే ప్రారంభించేసి నట్లున్నారు. సభా ప్రాంగణము లోనికి అడుగిడు సాహసము చేయలేక, నేను టౌనుహాలు గోడ ప్రాకారపు గోడ వారగా నిలబడితిని. నాకు దగ్గరలో నున్న దూర శ్రవణయంత్రం క్షమించాలి—దాన్ని శబ్ద విస్తరణ యంత్రమనాలి కాబోలు ఇలా ప్రసారం చేస్తోంది.

"ఈ నాడు మనం సన్మానించబోతున్న పరం ధామయ్యగారు నివురుగప్పిన నిప్పు లాంటి వారు! వారి గుణ గణాలనుంచి శక్తి యుక్తుల గురించి ఎందరో ప్రసంగించారు. ఈ నాడు వారికి సన్మానం చేస్తున్నది ఎందుకంటే మీకు తెలిసే ఉంటుంది. అడ్డమైన రాతలు నానా చెత్తా రాసి పాఠక లోకాన్ని పాడు చేసి, భాషను ఖూనీ చేసి, సాహితీ క్షేత్రాన్ని సర్వ నాశనం చేయకుండా ఉండ గలిగేటందుకే మన పరంధామయ్యగారు ఏ రచనా ప్రక్రియా చేపట్టలేదు. ఆయన ఏమీ రాయక పోవడమే ఆయన సాహితీ లోకానికి చేసిన అపారమైన సేవ. ఆ విధంగా ఆయన సాహితీ లోకాన్ని రక్షించారు అందుకే ఆయనకు ఈ నాడు అందరం "సాహితీ లోక రక్షక్" బిరుదుతో సత్కరించి..."

అంతా కరతాళధ్వనులు మిన్ను ముట్టాయి. జనం గందర గోళంగా లేచి వచ్చేశారు. వారి పద ఘట్టనల కింద నలగకుండ తగు జాగ్రత్తకై వడి వడిగా ఇల్లు చేరుకున్నాను. ★

